

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



**(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)**



# 15. రౌండుమేడ సత్యవతి

“**వచ్చే శనివారం మా** పెద్దమ్మ కొడుకు ‘చక్రి అన్నయ్య’ వస్తున్నాడు. రెండురోజులుండి వెళ్తాడు. మధ్యాహ్నం ఫోను చేసాడు” అన్నాను చదరంగం అట్టమీద ఒంటెను జరుపుతూ. నేను, మా ఆవిడ కామేశ్వరి ఆ సాయంత్రం మేడమీద వరండా అరుగుమీద కూర్చొని చదరంగం ఆడుతున్నాము.

"యే పనిమీద?” అంది కామేశ్వరి గుర్రాన్ని తన జరిపి.

అప్పుడే చీకటి పడుతోంది. పెరటివైపు చెట్లనుంచి చల్లగాలి వీస్తోంది.

“తెలియదు, వచ్చాక చెప్తానన్నాడు. మనవీధిలో నలుగురైదుగురి క్షేమసమాచారాలు అడిగాడు. అందులో సత్యవతి టీచరు, వాళ్లాయన మంగపతి వున్నారు" అన్నాను ఏనుగును పక్కగడిలోకి తోసి.

"యెవరు, ఆ రౌండుమేడ టీచరమ్మేనా? ఆమె యెక్కడికీ రాదు, యెవరితో మాట్లాడదు యెందుకని?" అడిగింది కామేశ్వరి మంత్రిని జరిపి చెక్ పెడుతూ.

నేను ఆటమీద ఎక్కువసేపు దృష్టి పెట్టలేను. అందుకని చదరంగంలో ఎక్కువసార్లు కామేశ్వరే గెలుస్తూంటుంది.

“వొక్కోసారి మనుషులు కొన్ని నిర్ణయాలు తీసుకుని తమ జీవితాన్ని లోకరీతికి భిన్నంగా మార్చుకుని వొంటరితనంలోకి కూరుకుపోతూంటారు.n సత్యవతి అలాంటి వొంటరిమనిషే. మనుషులకున్న స్వతంత్రాన్ని కాదనలేమనుకో. కానీ ఆమె యెన్నుకున్న దారి సరైనదేనా అనేదే ప్రశ్న" అన్నాను.

“అది ఆ మనిషి స్వంతంగా తీసుకున్న నిర్ణయమా లేక యెవరికైనా లొంగి తీసుకున్నదా, ఆ నిర్ణయం తరువాత ఆ మనిషి సంతోషంగానే వున్నారా, లేదా అనేదాన్ని బట్టి వుంటుంది. ఆమె పాతికేళ్లనుంచి యిలాగే వుందంటారు. యిలా యెందుకైంది?" అంది కామేశ్వరి.

“సత్యవతి నాకంటే యేడేళ్లు పెద్ద. డిగ్రీ పరీక్షలవగానే ఇంకాచదువుకుంటానని అన్నావినకుండా ఇంట్లోవాళ్లు ఆమెకు పెళ్లిచేసారు. అతను ఆర్మీ యింజనీరింగ్ విభాగంలో టిబెట్ బార్డరు ప్రాంతంలో పనిచేసేవాడు. పెళ్లైన తరువాత అప్పుడప్పుడూ వచ్చిపోయేవాడు. అతను తాగుతాడని భార్యాభర్తలకు గొడవలౌతున్నాయని అనుకునేవాళ్లు. రెండేళ్లు అలా గడిచాక ఆ వేసవిలో అతను ప్రమాదవశాత్తూ గ్లేసియర్ ప్రవాహంలో కొట్టుకునిపోయి చాలారోజులు ఆచూకి తెలియలేదు. రకరకాల వార్తలొచ్చాయి. యేడాది తరువాతగాని అతని మరణాన్ని గవర్నమెంటు ధృవీకరించలేదు. ఆ తరువాత బీయీడి చెయ్యడానికి బెంగుళూరు వెళ్లిపోయింది. బీయీడి అవగానే ఆమెకిష్టం లేకపోయినా ఇంట్లోవాళ్ల బలవంతంమీద మావూరి

ఎయిడెడ్ స్కూల్లోనే టీచరుగా చేరింది. కొన్నాళ్లు బాగానే ఉండేది. తరువాత ఏమైందోగాని జుట్టు పొట్టిగా కత్తిరించుకుంది. మనుషులతో మాట్లాడ్డం మానేసింది.

ఐదేళ్లకిందట, అంటే ఆమెకు యాభైయేళ్లు దాటిన వయసులో, ఆమె రిటైర్డ్ కేంద్రప్రభుత్వ వుద్యోగి మంగపతిని ఢిల్లీలో పెళ్లిచేసుకుని వచ్చింది. అతనూ ఒంటరివాడేనని సత్యవతి డిల్లీకి ట్రైనింగ్ కి వెళ్లినప్పుడు వాళ్లిద్దరికి పరిచయమైందని తెలిసింది. అప్పటికే ఆమె అమ్మానాన్నా పోయారు, అన్నదమ్ములు ఉద్యోగాల్లో దూరంగా వెళ్లిపోయారు. ఆయన యింట్లోనుంచే ఖనిజాల కన్సల్టెంటుగా పనిచేస్తాడు, యెవర్తోనూ మాట్లాడడు. అలా ఎవరికీ చెప్పకుండా చేసుకోవడం మా వీధి పెద్దలకు నచ్చలేదని ఆరోజుల్లో 'వార్తల వనజమ్మ' చెప్పేది" అని వివరించి నిట్టూర్చాను.

"ఆమె యెందుకు మాట్లాడదు అనడిగితే నాకు ఆమె చరిత్ర చెబుతావేం? అది వీధిలో అందరికీ తెలుసు" అంది కామేశ్వరి చిరుకోపంతో.

"పెళ్లయేవరకు సత్యవతి పొడవైన జుట్టుతో చక్కగా వుండేది. ఎప్పుడూ తలనిండా పూలతో, గలగలా నవ్వుతూ వీధిలో అన్నియిళ్లూ తిరిగేది. ఆడామగ తేడాలేకుండా ఆమె అందర్తో చనువుగా మాట్లాడ్డం మాపెద్దలకి నచ్చేది కాదనుకో. ఐతే ఆమె పెళ్లైన రెండేళ్లకే భర్తపోవడం, ఆ యేడాదికాలం సత్యవతికి సంఘంలో తన స్థానం నిర్ధారణకాక సానుభూతులతోపాటు అనుమానాలు, అవమానాలుకూడా ఎదుర్కొంది. ఆతరువాత యింట్లోవాళ్లు మరో పెళ్లి చెయ్యకపోవడంతో అలా వొంటరిగా ఐపోయిండచ్చు" అన్నాను.

"యిందులో మన వీధిపెద్దల నిర్వాకంకూడా వుంటుంది." అంది కామేశ్వరి కోపంగానే.

"వీధిలో చెడు యేది జరిగినా వాళ్లనే బాధ్యులను చేస్తావు. అప్పుడేం జరిగిందో నాకు తెలియదు. నేను చిన్నవాణ్ణి" అన్నాను నవ్వి.

"ఐనా అలా వొకమనిషి జీవితాన్ని శాసించే అధికారం మరొకరికెలావుంటుంది? జీవితం యెంతో విలువైంది, వొక్కసారే వస్తుంది. శాసించేవాళ్లు పోయినకాలాన్ని వెనక్కి తేగలరా?" అంది. ఈసారి ఆమె గొంతులో బాధ ధ్వనించింది.

"ఆమె యింట్లోవాళ్లని యెదిరించి యింకోపెళ్లి అప్పుడే చేసుకుని వుండొచ్చుగదా?" అన్నాను లైటు వేసి వచ్చికూర్చుంటూ.

కామేశ్వరి మాట్లాడలేదు. వీధిలో సాయంత్రం ఇళ్లకి తిరిగొచ్చే మనుషుల సందడి పల్చబడుతూంది. కొబ్బరిచెట్లు ఊగే చప్పుడు, గుడిగంటలూ అడపాదడపా వినిపిస్తున్నాయి.

"వేరేవూళ్లలో ఫంక్షన్లలో కలవడం తప్ప మీ చక్రి అన్నయ్య యీవూరెప్పుడూ రాలేదు. పాతికేళ్ల తరువాత యిదే రావడమనుకుంటా" అంది కామేశ్వరి. ఆమెగొంతులో ఆశ్చర్యం, ప్రశ్న రెండూ ధ్వనించాయి.

"యెందుకో నాకూ తెలియదు. పాతికేళ్లకిందట వో మూడునెల్లపాటు యెందుకో యీవూరికి చాలాసార్లు వచ్చాడు. అన్నయ్య నాకంటే పదేళ్లు పెద్ద. బెంగుళూర్లో  లెక్చరరుగా వుద్యోగం చేసేవాడు. అప్పటికింకా అన్నయ్యకి పెళ్లికాలేదు. చివరగా ఆయన వెళ్లిపోయినరోజు మాత్రం నాకు బాగా గుర్తు. ఆరోజు తెల్లవారుఝామున మూడుగంటలకే ఆయన బస్సు. యింటిదగ్గర రెండున్నరకే  బయలుదేరాడు. మా అమ్మ నన్ను నిద్రలేపి సైకిలుమీద ఆయన బ్యాగు పెట్టుకుని వెళ్లమంది. ఆయన యెంతవద్దన్నా వినలేదు. బస్సు మూడుకే వచ్చింది. ఆయన బస్సెక్కలేదు. యెవరికోసమో యెదురుచూస్తున్నట్టుగా నాలుగు, ఐదుగంటల బస్సులుకూడా యెక్కలేదు. చివరికి ఆరుగంటలబస్సుకు వెళ్లాడు. నేనెంత అడిగినా కారణం చెప్పలేదు. అందుకే అదినాకు బాగా గుర్తు" అన్నాను.

కామేశ్వరి ఏదో దీర్ఘాలోచనలో పడినట్టుగా మౌనంగా ఉండిపోయింది. ఆలస్యంగా గూటికి వస్తున్నట్టుగా ఒక పక్షి పెరట్లోని వేపచెట్టువైపు హడావుడిగా వెళ్లింది. లేచి కిందకి వెళ్లాము. కామేశ్వరి వంటపనుల్లో పడింది.

చెప్పినట్టుగానే మరుసటి శనివారం పొద్దున చక్రి అన్నయ్య వచ్చాడు. నాతో, కామేశ్వరితో చాలాసేపు కబుర్లు చెప్పాడు. పెరట్లోని మొక్కలని చూసి కామేశ్వరిని మెచ్చుకున్నాడు. ఆయన పిల్లలిద్దరూ బెంగుళూరు కాలేజీల్లో చదువుకుంటున్నారు. ఆమధ్య వదినకు చిన్న సర్జరి జరిగింది, ఇప్పుడు ఆరోగ్యంగా ఉంది. మా అమ్మాయి రిషివ్యాలి స్కూల్లో చదువుతున్నందుకు సంతోషించాడు. ఆ స్కూలు బావుంటుందన్నాడు. తనెందుకొచ్చిందీ మాత్రం చెప్పలేదు. నేనడగబోతే కామేశ్వరి వారించింది.

మధ్యాహ్నం భోజనంచేసి పడుకుని లేచాక "కామేశ్వరి భారీగా తిండి పెట్టేసింది. అలా నడిచొద్దాం రా సూర్యం" అని బయటికి దారితీసాడు.

వీధిలో సాయంత్రపు కోలాహలం ఇంకా మొదలవలేదు. అప్పుడే బయటినుంచి వచ్చిన మాయెదురింటి చలపతి మమ్మల్ని చూసి చెయ్యివూపి లోపలికెళ్లాడు. పరోపకారి పాండురంగ, భార్య సుశీల ఎవరికోసమో హడావుడిగా వెళ్తున్నారు. రంగశాయి ఇంట్లోంచి కుర్రాళ్ల నవ్వులు వినిపిస్తున్నాయి. విమల యింటిముందు పిల్లలు ఆడుకుంటున్నారు. దూరంగా బురుజుదగ్గర ఇద్దరు తోపుడుబళ్లవాళ్లు మాట్లాడుకుంటున్నారు. నదివైపు నడుస్తూండగా అన్నయ్య వీధిలోని కొందరి గురించి అడిగాడు, అందులో మా సంఘపెద్దలుకూడా ఉన్నారు.

“పాతికేళ్లైనా అందరూ గుర్తున్నారే?” అన్నాను

“మెదడులోని వొక పార్శ్వంలో వొక్కోసారి కాలం ఘనీభవించి వుంటుందేమో” అన్నాడు నవ్వి.

‘రౌండుమేడ’ రాగానే ఆగి “వొకసారి మంగపతిని పలకరిద్దాం పద" అంటూ ఆ ఇంటివైపుకి దారి తీసాడు.

"ఆయన్నీకు తెలుసా?" అడిగాను.

“ఆయన బెంగుళూరులో మాకాలేజికి వచ్చి వుపన్యాసాలిచ్చేవాడు" అన్నాడు తలవూపి.

గేటు తీసుకుని లోపలికెళ్లాం. ముందువైపంతా పారిజాతం, మందార, మల్లె, జాజి, లిల్లీ, కనకాంబరం, చేమంతులు అడవిలాగ పెరిగివున్నాయి. వీధితలుపు పక్కగాఉన్న మేడమెట్ల బయటిగోడ రెండోఅంతస్తు పైవరకు పొడవుగా అర్ధవృత్తాకారంలో ఉంటుంది, అందుకే ఆయింటిని 'రౌండుమేడ' అంటారు.

వీధితలుపు ఓరగా తీసేవుంది. హాల్లోకెళ్లాము. సోఫాలో కూర్చుని మంగపతి టీవీలో భూగర్భశాస్త్ర ప్రోగ్రాం చూస్తున్నాడు. పొట్టిగా మధ్యపాపడితో ఉంటాడు, తెల్లబడిన హిట్లరు మీసాలు. సత్యవతి దూరంగా భోజనాల బల్లముందు కూర్చుని ఆకుకూర విడదీస్తోంది. సన్నటి మనిషి. అరవైయేళ్లు దగ్గరపడ్డా చక్కదనం సడలలేదు.

"మంగపతిగారూ బావున్నారా?" అన్నాడు అన్నయ్య.

అతను తదేకంగాచూసి కష్టంమీద గుర్తుపట్టి "నువ్వా చక్రవర్తీ యెప్పుడొచ్చావు, కూర్చో?" అని నావైపు చూసి "సూర్యం నీకు తెలుసా?" అన్నాడు.

సత్యవతి చేస్తున్నపని ఆపేసి బొమ్మలా ఐపోయి అన్నయ్యవైపు చూస్తోంది.

"సూర్యం మా పిన్ని కొడుకు" అన్నాడు అన్నయ్య. మేము పక్కసోఫాలో కూర్చున్నాము. సత్యవతి మాకెదురుగా ఉంది.

మంగపతి సత్యవతికి అన్నయ్యను పరిచయం చేసాడు. ఆమె తేరుకుని నమస్కారం పెట్టి, మాకు మంచినీళ్లిచ్చి, 'కాఫీ తెస్తా'నని వంటింట్లోకి వెళ్లింది..

మంగపతి, మా అన్నయ్యా కాస్సేపు గతంలోకి వెళ్లి మళ్లీ వర్తమానంలోకి వచ్చారు. అతనితో అన్నయ్యకంత సాన్నిహిత్యం లేదని తెలుస్తూంది, మాటలు వెతుక్కుంటున్నారు.

అన్నయ్య అతన్ని ఖనిజాల గురించి ఏవో ప్రశ్నలడిగాడు. అప్పటివరకూ పొడిపొడిగా మాట్లాడిన మంగపతిలో మార్పొచ్చింది. ఖనిజాలగురించి ఒక టీచరులాగా ధారాళంగా మాట్లాడ్డం ప్రారంభించాడు. అతను ఎక్కువగా నాకేసి చూస్తూండడంతో నాప్రమేయం లేకుండానే నేను ముఖ్యశ్రోతనైపోయాను.

అన్నయ్య వింటూనే మధ్యమధ్యలో సత్యవతితో మాట్లాడుతున్నాడు. ఆమె కూడా అన్నయ్యతో నెమ్మదిగా మాటలు కలిపింది.

కాసేపయ్యాక "మంగపతిగారూ మీ ఢిల్లీయింట్లో వొకగదినిండా అరుదైన ఖనిజాల శ్యాంపిల్స్ నిలువచేసివుంచారు. అవక్కడే వదిలేసి వచ్చారా?" అనడిగాడు అన్నయ్య.

"లేదు చక్రవర్తీ, అవన్నీ కష్టపడి యిక్కడకు తెచ్చి మేడపైన గదిలో వుంచాను" అన్నాడు మంగపతి.

"వాటికోసం అద్దాల బీరువాలు తయారుచేయించారు" నిర్లిప్తంగా అంది సత్యవతి.

"వాటిని దేశమంతా తిరిగి సేకరించాను, నాతరువాత యేదైనా కళాశాలకి యిచ్చేయాలని వుద్దేశం. రండి చూద్దురుగాని" అంటూ లేచి మెట్లవైపు దారితీసాడు మంగపతి.

"నేను ఢిల్లీలో చూసానుగా, మా సూర్యానికి చూపించండి" అన్నాడు అన్నయ్య. నేను మంగపతివెంట పైకి వెళ్లాను.

మేడపైనున్న గదుల్లో ఒకదాన్ని మంగపతి ఖనిజాల మ్యూజియంలాగ మార్చేసాడు. గదినిండా అద్దాలబీరువాల్లో అరలనిండా రకరకాల రంగుల్లో ముడిఖనిజాల ముక్కలు ఒక పద్ధతిగా పెట్టివున్నాయి. కొన్ని మెరుస్తున్నాయి. వాటిముందు వివరాలు రాసిన తెల్లని అట్టముక్కలున్నాయి. ప్రతి అరలో ట్యూబులైటు ఉంది. మరోబీరువాలో ఖనిజాలకు సంబందించిన పుస్తకాలు, పత్రికలూ, పక్కనే బల్లమీద కాగితాలు, కంప్యూటర్ ఉన్నాయి.

మంగపతి లైట్లు వెలిగించి "యిప్పుడందరూ ఖనిజాల్ని వ్యాపారదృష్టితో చూస్తున్నారు. వాటితో స్నేహంచేసి ఆ లోతుల్ని అర్థంచేసుకోవాలని యెవరూ అనుకోవడంలేదు" అని ఓపక్కగా మొదలుపెట్టి వాటిగురించి చెప్పుకుంటూపోయాడు. చెప్పడం పూర్తయ్యేసరికి నాకు ఖనిజాలగురించిన ఒక అవగాహన వచ్చిందనిపించింది.

గంట తరువాత కిందకి వచ్చాము. హాల్లో అన్నయ్య, సత్యవతి నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. సత్యవతి బాగా ఏడ్చినట్టుగా మొహం జేవురించివుంది. కళ్లు ఉబ్బివున్నాయి. అన్నయ్య మొహంకూడా గంభీరంగా ఉంది. యేంజరిగివుండచ్చో నాకు అంతుపట్టలేదు.

మంగపతి తిరిగి సోఫాలోకి వచ్చి ఖనిజాలు వెలితీయడంలోవున్న సమస్యల పరిష్కారానికి తను సూచించిన మార్గాలగురించి చెబుతున్నాడు.

మమ్మల్ని చూసి సత్యవతి లేచి వంటింట్లోకి వెళ్లి పళ్లముక్కలు కోసుకుని వచ్చింది. లోపల ఆమె నీళ్లతో మొహం కడుకున్నట్టు తెలుస్తోంది. కాస్సేపు మాట్లాడుకున్న తరువాత 'వెళ్లొస్తా'మని మేం లేచాం.

"రేపాదివారమేగదా, కామేశ్వరిని తీసుకుని మీయిద్దరూ మధాహ్నం భోజనానికి రండి" అంది సత్యవతి. ఆమె గొంతులో దు:ఖపుజీర ఉంది.

ఆమె ఇలా చనువుగా నాతో మాట్లాడ్డం ఈ పాతికేళ్లలో బహుశా ఇదే.

"తప్పకుండా రావాలి, రేపుకూడా నేను ఖాళీయే" అన్నాడు మంగపతి.

"సరే" అన్నాను. మేం బయటకు వచ్చేసరికి చీకటిపడింది. వరండా లైటు మసకవెల్తురులో గేటుదగ్గర అన్నయ్య, సత్యవతి దిగులుగా ఒకర్నొకరు చూసుకున్నట్టు నాకనిపించింది.

బయటికొచ్చాక అలా బురుజువరకూ నడుస్తూవెళ్లాం. దారంతా అన్నయ్య మౌనంగా ఉన్నాడు. ఇంటికెళ్లేసరికి కామేశ్వరి రాత్రిభోజనం తయారుచేసి సిద్ధంగా ఉంది. భోజనం తరువాత 'నదివొడ్డుకు షికారుకి వెళ్దా'మని నేనే అడిగాను. అన్నయ్య నవ్వి 'పద' అన్నాడు.

డిసెంబరు చలికి వీధంతా సద్దుమణిగింది. గుడిమూసేసి గోపురంపైనున్న ఫ్లడ్ లైటు ఆపేసారు. ఇళ్లలోపలి దీపాల కాంతి కిటికీల్లోంచి సన్నగా కనిపిస్తోంది.

నదివొడ్డున రాత్రిపక్షులు నదిమీద ఎగిరే శబ్దపు ఆనవాళ్లు, గాలివీచినప్పుడు రావిచెట్టు గలగలలు తప్ప అంతా ప్రశాంతంగా ఉంది. దూరంగా మూసేసిన ఫ్యాక్టరి పైకప్పు సిలౌటి సప్తమినాటి వెన్నెల్లో నింగినుంచి నేలను వేరుచేస్తున్న నల్లటి అంచులాగుంది. మసక వీధిలైట్ల కాంతిలో ఇటు రాయుడిగారిమేడ పైఅంతస్తుల చిన్నిగోపురాలు, అటు వీధిమొదట్లోని బురుజు గతకాలం వెళ్లకుండా, వర్తమానం రాకుండా రహస్యంగా పహారా కాస్తున్నాయి. గట్టుమీద నడవడం మొదలెట్టాము.

"రెండు ప్రశ్నలకు నువ్వు సమాధానం చెప్పాలి. పాతికేళ్లనాడు ఆ తెల్లవార్ఝామున వెళ్లేప్పుడు నువ్వు యెవరికోసమో వేచిచూసినట్టు మూడు బస్సులను వదిలేసావు, మళ్లీ యీవూరు రాలేదు. యీసాయంత్రం మాదృష్టిలో నీకు పరిచయంలేని సత్యవతితో చాలాసేపు మాట్లాడావు, ఆమె భావోద్వేగానికి లోనై యేడ్చినట్టు కనపడింది. యీరెండింటికీ యేమైనా సంబంధముందా?" అనడిగాను అన్నయ్య మొహంలోకి చూసి.

"వుంది" అన్నాడు.

"నీకభ్యంతరం లేకపోతే యెంజరిగిందో చెప్పు" అన్నాను.

"సత్యవతికి పెళ్లవడం, కాపురం పెట్టకుండానే భర్త పోవడం యివన్నీ నీకు తెలుసు. మన సంఘానికి కొందరు మనుషులను తక్కువచేసి యేడిపించడంలో యేదో ఆనందం వుందనుకుంటాను. యిక్కడ సత్యవతిని చాలా బాధపెట్టారు. జీవనాధారంకోసం ఆమె బీయీడి చదవడానికి బెంగుళూరు వచ్చింది. అప్పట్లో ఆకాలేజిలో కొన్నాళ్లు నేను లెక్చెరరుగా పనిచేసాను. అక్కడే ఆమె నాకు పరిచయం. నేనామెకు దూరంగా వుంటూనే గౌరవించేవాడిని. తెలియకుండానే ఆమె నాకు దగ్గరైంది. రెండేళ్లు కాపురం చేసినా కలసివుండకపోవడం, భర్త పద్ధతులు నచ్చక అతనితో సాన్నిహిత్యం పెరగకపోవడం మరోకారణం కావచ్చు. అప్పటికే నాకు మాయింట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు" అని ఆగాడు.

"మీ యిద్దరూ పెళ్లిచేసుకోవాలనుకున్నారా?" అడిగాను.

అన్నయ్య నవ్వి "అది అంత తొందరగా జరగలేదు. ఆమె డిప్రెషన్ నుంచి బయటపడడానికే చాలాసమయం పట్టింది. లంచ్ అవర్లో మాట్లాడుకునేవాళ్లం. అప్పుడప్పుడూ పార్కులో కలిసేవాళ్లం. మేం దగ్గరయ్యాక క్రమంగా ఆమెలో మార్పొచ్చింది. మళ్లీ జీవితాన్ని ప్రేమించడం మొదలుపెట్టింది. ఆమె పెట్టుకోకపోయినా పువ్వులుకొని దండలు కట్టేది.

వొకరోజు నేనే పువ్వులదండ ఆమెజడలో తురిమాను. ఆరోజు చాలా సంతోషపడింది. సత్యవతి చదువైపోయే సమయానికి మేం పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నాం. కాని తిరిగొచ్చాక తను ఆవిషయం యింట్లోవాళ్లకి చెప్పే ధైర్యం చేయలేకపోయింది. నేను యిక్కడికివచ్చి స్కూల్లో కలిసి ధైర్యం చెప్పేవాడిని. వొక్కోసారి చీకటిపడ్డాక యిక్కడే యీచెట్లనీడల్లో కలసేవాళ్లం" అన్నాడు.

"ఆ కాలంలోనే అంత ధైర్యంగా యిక్కడ కలిసేవారా? యెవరికంటా పడలేదా?'' అన్నా ఆశ్చర్యంతో.

"మొదట్లో యెవరూ అంతగా పట్టించుకోలేదు. మీసంఘపెద్దలు కొంతమంది కంటపడ్డాకే మా కష్టాలు మొదలయ్యాయి. మీ వీధి పెద్దలిద్దరు నన్నుకలసి నాకు వార్నింగివ్వబోతే కుర్రవయసు తెగువతో యెదిరించాను. ఆతరువాత సత్యవతిమీద యింట్లో వొత్తిడి, నిఘా పెరిగాయి. మా పెళ్లినిర్ణయం సత్యవతి అప్పుడు యింట్లోవాళ్లకు చెప్పింది"

"యేరకంగా చూసినా వాళ్లు యెగిరిగంతేసి పెళ్లికొప్పుకోవాలి. కథ సుఖాంతమెందుకు కాలేదు?"

"సత్యవతి అమ్మ మహాచాదస్తురాలు, వీరేశలింగం ముందుకాలంనాటి మనిషి. సత్యవతిఅన్న నాజాతకాన్ని తయారుచేయించి యెవరో స్వామీజికి చూపిస్తే అది సత్యవతికి పడదని చెప్పాడట. మీపెద్దల్ని సంప్రదించారు. నామీద కోపంతో వాళ్లు తెలిసీ మూఢవిశ్వాసాలనే బలపరిచారు. నాకిదివరకే పెళ్లైవుండొచ్చని చెప్పి భయపెట్టారు. సత్యవతి యింటిల్లిపాది వొప్పుకోలేదు"

"యివన్నీ సిల్లీ రీజన్స్ కదా!" అన్నాను నేను విరక్తిగా

"హేతువు కాకుండా యేదోవొక మూఢత్వమే చాలా సందర్భాల్లో మనిషిని నడిపిస్తూ వుంటుందని అంటారు. మానవ పరిణామక్రమమంతా యిదేకదా సంఘర్షణ. అతికష్టంమీద సత్యవతి స్కూలుదగ్గర నన్నుకలసి యింట్లోవాళ్ల వ్యతిరేకత గురించి చెప్పి యేడ్చింది. సత్యవతిని నాతో బెంగుళూరు వచ్చేయమన్నాను, చాలాసేపు చెప్పాక సరేనంది. ఆ తెల్లవార్ఝామున తను బస్టాండుకి రావాల్సివుంది. అప్పుడు యేంజరిగిందో నీకు తెలుసు" అన్నాడు.

"వస్తానని ఆరోజెందుకు రాలేదు?" అనడిగాను.

"బస్టాండుకి రావడానికి ఆటోరిక్షా యేర్పాటుకూడా చేసుకుంది. ఆటో రావడం నేను చూసాను. ఐతే సత్యవతి వెళ్లిపోతుందని ఆరాత్రి వాళ్లమ్మ పసికట్టి 'ఆత్మహత్య చేసుకుంటా'నని తలుపుకడ్డం కూర్చుందట. ఆమె అన్న మీ సంఘపెద్దల్ని పిలుస్తానని బెదిరించాడట. తరువాత కొన్నాళ్లకి సత్యవతి వుత్తరంలో యివన్నీరాసి 'యిక నన్ను మర్చిపో చక్రీ, నాజీవితంకూడా గ్లేసియర్ లో కొట్టుకుపోయిందనుకో, నువ్వైనా పెళ్లిచేసుకుని సంతోషంగా వుండు' అని ముగించింది" అని నిట్టూర్చాడు అన్నయ్య. పాతికేళ్లుగా గడ్డగట్టిన గ్లేసియర్ మంచు ద్రవీభవించి కదలినట్టుగా అతని గొంతు వణికింది .

"వాళ్ల మూర్ఖత్వం ఆమె జీవితాన్ని ట్రాజెడి చేసింది" అన్నా కామేశ్వరి మాటల్ని గుర్తుతెచ్చుకుంటూ.

"పోనీ విజ్ఞానం, ఆధునికత పెరిగాయిగదా, యిప్పుడేమన్నా మీ వీధిపెద్దలు మారారా?" అడిగాడు అన్నయ్య.

తల అడ్డంగా ఊపాను. మాటల్లో చాలాసేపు నడచాము కాబట్టి కాసేపు రావిచెట్టు కింద అరుగుమీద కూర్చున్నాము.

"కథంతా చెప్పావు, పాతికేళ్ల తరువాత యిప్పుడెందుకొచ్చావో చెప్పలేదు. సత్యవతిని చూడ్డానికేనా?" అడిగాను.

"మీ వదినతో నా పెళ్లయ్యాక యిక సత్యవతి జ్ఞాపకాల్ని పక్కన పెట్టేసాను. పెళ్లికి ముందే మీవదినకు యీకథంతా చెప్పాను. తను స్పోర్టివ్ గా తీసుకుంది. యిరవైయేళ్ల తరువాత మొన్న బీరువా సర్దుతుంటే యిది కనపడింది. బియాడి ఐపోయి బెంగుళూరు వదిలి వచ్చేప్పుడు సత్యవతి నాకిచ్చింది" అని ప్యాంటు జేబులోంచి ఒక కాగితపు పొట్లం తీసి నాచేతిలో పెట్టాడు.

విప్పిచూస్తే ఎర్రని ఉలిపిరికాగితంలో కెంపు పొదిగిన బంగారు ఉంగరం ఉంది.

"'సత్యవతి మరో పెళ్లికూడా చేసుకుంది. వొకసారి కలిసి మాట్లాడి, యీ వుంగరం యిచ్చేస్తాను. ఆమె మనసులోపలి కొరత పోతుంది' ... అని మీ వదినతో చెప్తే 'ఆమె తప్పకుండా వెళ్లండి, కాని ఆమె వుంగరం తీసుకోదు' అంది" అన్నాడు అన్నయ్య.

"వదినది మంచి మనసు. మరి వుంగరాన్ని యివ్వలేదా?" అన్నాను.

"ఆమె తీసుకోలేదు 'నీదగ్గరే వుండనీ' అంది" అన్నాడు ముక్తసరిగా.

"'నిరంతరం కొరతవుండడమే మనిషికి యితరజీవులకు తేడా' అని 'సార్త్ర్' చెప్పాడనుకుంటా. కొరతే జీవించడానికి ముఖ్యమైన గతిశక్తి ఔతుందేమో" అన్నాను నవ్వుతూ.

రాత్రి చాలా గడిచింది. చంద్రుడు వెళ్లిపోయాడు. నదికవతలి ప్రకృతి అంతా నక్షత్రాల వెలుగులో చరిస్తోంది. ఇంటికి బయలుదేరాము.

"' మళ్లీ వస్తావో రావో. నా చేత్తో తయారుచేసిన భోజనాన్ని వొకసారైనా తినివెళ్లు' అంది సత్యవతి. అందుకే రేపు మనల్ని పిలిచింది" అన్నాడు అన్నయ్య చిన్నగా నవ్వి.

వీధిలోని నిశిరాత్రి నిశ్శబ్దంలో మేమూ కలసిపోయి నడుస్తూ ఇల్లు చేరాము.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments